సాక్షి
మంచిర్యాల

బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024

'ప్రాణహిత' నిండుకుండ


పుష్కరఘాట్ వద్ద ప్రాణహిత నది

వేమనపల్లి: గత రెండు రోజులుగా ప్రాణహిత నది వరద పోటుతో నిండుగా ప్రవహిస్తోంది. దిగువన గోదావరి నదిలో అధికంగా వరద తీవ్రత ఉండడంతో ప్రాణహిత వరద దిగువకు వెళ్లలేక లోతట్టు ప్రాంతాలను ముంచెత్తే ప్రమాదం ఉంది. దీనికి తోడు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఉన్న వైన్ గంగా, వార్దా నదులకు ఉన్న పలు రిజర్వాయర్ల నుంచి వరద ప్రాణహితకు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాణహిత నదిలో గంట గంటకు వరద తీవ్రత పెరుగుతూనే ఉంది. గత రెండు రోజులుగా తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల్లో నాటుపడవల రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోయాయి.

న్యూస్‌రీల్

బాలింతల ఆరోగ్యం పరిశీలన


ప్రైవేటు ఆసుపత్రిలో పరిశీలిస్తున్న అనిత

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాలింతల ఆరోగ్యాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత పరిశీలించారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి వరద ముప్పు పొంచి ఉండడంతో గర్భిణులు, చిన్నారులు, బాలింతలు కొందరిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి, రెండు ప్రైవేటు ఆస్పత్రులకు తొమ్మిది మంది బాలింతలను సోమవారం తరలించిన విషయం తెలిసిందే. ప్రైవేటు ఆస్పత్రుల్లోని బాలింతల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. వారంతా ఆరోగ్యంగానే ఉన్నారని, పూర్తి స్థాయిలో వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

వరద బాధితులకు ఒకరోజు వేతనం


మాట్లాడుతున్న టీఎన్జీవోస్ నాయకులు

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో భారీ వర్షాలతో తీవ్ర ఆస్తి, పంట నష్టం జరిగి ప్రజలకు సరైన తిండి, నిలువ నీడ లేక ఉన్నవారికి అండగా ఉండేందుకు ప్రభుత్వ ఉద్యోగులు ముందుకొచ్చారు. జిల్లా కేంద్రంలో మంగళవారం టీఎన్జీవోస్ నాయకులు మాట్లాడుతూ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులందరూ ఒకరోజు మూల వేతనాన్ని అందజేస్తూ తీర్మానించిన ట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ ఒకరోజు వేతనాన్ని ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షు డు గడియారం శ్రీహరి, జిల్లా కార్యదర్శి భూ ముల రామ్మోహన్, రాష్ట్ర కార్యద ర్శి పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, కోశాధికారి ఏ.సతీశ్‌కుమార్, ఉపాధ్యక్షులు కేజియారాణి, శ్రీనివాస్, రామ్‌కుమార్, తిరుపతి, అంజయ్య, సంయుక్త కార్యదర్శులు సునిత, పద్మలత, ప్రభ, వెంకటకృష్ణ, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, కార్యదర్శి అజయ్, మందమర్రి యూనిట్ అధ్యక్షుడు సుమన్, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

- డీఎంహెచ్‌ఓ హరీష్‌రాజ్
- పీహెచ్‌సీల్లో ఆకస్మిక తనిఖీ


తాళ్లగురిజాలలో డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

నెన్నెల/బెల్లంపల్లి/భీమిని: భారీ వర్షాల నేపథ్యంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఎప్పటికప్పుడు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ హరీష్ రాజ్ సూచించారు. మంగళవారం ఆయన నెన్నెల, బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల, భీమినిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యక్రమాల పనితీరు, రికార్డులు పరిశీలించారు. విషజ్వరాలు, డెంగీ, మలేరియా, అతిసారా, చికున్ గున్యా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించి గ్రామీణులకు సేవలు అందించినప్పుడే గుర్తింపు లభిస్తుందని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. భీమినిలో గర్భిణులు ఎంతమంది కాన్పు కోసం ఉన్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రుల్లో ప్రసవాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమాల్లో డెప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధాకర్ నాయక్, మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్, వైద్యులు ఎవంజలీన్, కుమారస్వామి పాల్గొన్నారు.

బీసీ సమీకృత బాలుర వసతి గృహం తనిఖీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక బీసీ ఇంటిగ్రేటెడ్ బాలుర వసతిగృహన్ని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు, సిబ్బంది వివరాల రికార్డులను పరిశీలించారు. సిబ్బంది వంటశాల వద్ద ఉండడంతో మందలించారు. ఆవరణ, బాత్రూంల వద్ద కూడా పర్యవేక్షణ ఉండేలా చూడాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా..? అని ఆరా తీశారు.

తప్పిన ముప్పు !


జిల్లా కేంద్రం పుష్కరఘాట్ సమీపంలో పత్తి చేను వరకు గోదావరి వరద

- తగ్గుముఖం పట్టిన వరద
- 'ఎల్లంపల్లి'కి తగ్గిన ఇన్‌ఫ్లో
- గోదావరి తీర ప్రాంతాలకు ఊరట

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గోదావరి వరదలతో ఈసారి ముప్పు తప్పింది. భారీ వర్షాలకు రోజు రోజుకు వరద నీటి తీవ్రత పెరిగింది. అదే తీరుగా కొనసాగితే ఇబ్బంది పడాల్సి వచ్చేది. మంగళవారం సాయంత్రం వరకు తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు(ఎస్సారెస్పీ) నుంచి భారీగా వరద వస్తుందనే అంచనాతో అధికారులు అప్రమత్తం అయ్యారు. మరోవైపు కడెం ప్రాజెక్టు నుంచి భారీగా వరద నీరు వచ్చింది. నదికి వచ్చే వరదతోపాటు వర్షంతోనూ ముప్పు ఉంటుందని అంచనా వేశారు. గత అనుభవాల దృష్ట్యా ముందు జాగ్రత్త వహించారు. ఎంసీహెచ్‌లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులను ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించి అక్కడే వైద్యం అందిస్తున్నారు. మంచిర్యాల, నస్పూర్ పట్టణాల్లో ముంపు కాలనీలను అప్రమత్తం చేశారు. మంగళవారం రాత్రి వర్షం నిలిచిపోవడం, క్రమంగా ఎగువ నుంచి నదికి వరద తగ్గుతూ వచ్చింది. దీంతో సాయంత్రం వరకు పరిస్థితి దాదాపు అదుపులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలోని పుష్కరఘాట్ వద్ద క్రమంగా నది నీటిమట్టం తగ్గుతూ వచ్చింది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గుతోంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20టీఎంసీలు కాగా, 14.2టీఎంసీలు చేరింది. మొత్తం 62గేట్లు ఉండగా, 32గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. మరోవైపు పంటలకు సైతం ఈసారి వరద ప్రభావం తక్కువగానే ఉంది. ప్రాణహిత, గోదావరి తీర ప్రాంతాల్లో వందల ఎకరాల్లో నీట మునిగేవి. ప్రస్తుతం వరద తగ్గడంతో పంట చేన్లకు ముప్పు తప్పనుంది.


పుష్కర ఘాట్ వద్ద తగ్గిన వరద

నిరంతరం అప్రమత్తత

గోదావరి తీర ప్రాంతాలకు వరద ముంపు నేపథ్యంలో జిల్లా యంత్రాంగం గత నాలుగు రోజులుగా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. జిల్లా పోలీసు, వైద్య, రెవెన్యూ, సాగునీటి, మున్సిపల్, పంచాయతీరాజ్, అత్యవసర సేవల శాఖల అధికారులు వర్షాలపై నిత్యం అప్రమత్తంగా ఉంటున్నారు. ఎమ్మెల్యేలు సైతం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు భారీ వర్షాల నేపథ్యంలో పర్యవేక్షించారు. అధికారులు, కార్యకర్తలు, నాయకులతో సమన్వయం చేస్తున్నారు. దీంతో ముందు జాగ్రత్తల చర్యలతోనూ బాధితులకు ఊరట కలిగింది. ఎంసీహెచ్ నుంచి బాలింతలు, గర్భిణులు, నవజాత శిశువులకు ఇబ్బంది కలుగకుండా ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యంతో మాట్లాడి అక్కడే చికిత్స అందించేలా ఏర్పాట్లు చేశారు. వారికి ఉచితంగా భోజనం అందిస్తున్నారు.

దండిగా నీరు..

జిల్లాలో కురిసిన వర్షాలకు వాగులు, చెరువులు నిండాయి. మొత్తం 625 చెరువులకు 565చెరువులు నిండగా, 55చెరువుల్లో సామర్థ్యం మించి నీరు చేరాయి. మరో రెండు చెరువుల్లో 50శాతంలోపే నీరు చేరింది. ప్రైవేటు, అటవీ, ఇతర పరిధిలో ఉన్న 840చెరువుల్లో 774పూర్తి స్థాయిలో నిండాయి. ఇక మధ్యతరహా ప్రాజెక్టులైన ర్యాలీవాగు, గొల్లవాగు, నీల్వాయి ప్రాజెక్టులు నిండుకుండల్లా ఉన్నాయి.


ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద మంత్రి శ్రీధర్‌బాబు

'ఎల్లంపల్లి'కి లక్షల క్యూసెక్కుల వరద నీరు

సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం రాత్రి(ప్రతీ రెండు గంటలకు) వరకు

సమయం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
12గం.	3,72,613	3,97,419
2గం.	4,82,907	4,51,879
4గం.	5,47,846	4,61,040
6గం.	5,82,491	5,20,491
8గం.	6,03,816	5,79,010
11గం.	5,58,759	5,33,954
12గం.	5,53,817	5,35,234
2గం.	5,20,414	5,57,609
4గం.	4,78,102	5,33,908
6గం.	4,72,354	4,72,354
8గం.	4,72,354	4,72,354
10గం.	4,58,817	4,71,234

(ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలు క్యూసెక్కుల్లో)

ఇబ్బందులు తలెత్తకుండా నీటి విడుదల


మంత్రి శ్రీధర్‌బాబుతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, కలెక్టర్‌లు శ్రీహర్ష, కుమార్‌దీపక్, సీపీ శ్రీనివాసులు

- వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం
- త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తారు
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి సమీక్షిస్తూ ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం సీపీ శ్రీనివాసులు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌లతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను సందర్శించారు. వరద నీటి పరిస్థితిని పరిశీలించి ప్రాజెక్ట్ అధికారుల ద్వారా తాజా పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఇప్పటివరకు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ప్రారంభానికి నోచుకోలేదని, త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. ప్రాజెక్ట్ రహదారి నిర్మాణం కూడా పూర్తయ్యేలా చూస్తామని, పర్యాటకులకు ఆహ్లాదం కోసం విశాలమైన పార్కును ఏర్పాటు చేస్తామని చెప్పారు. భారీ వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఆందోళన అవసరం లేదని, గత వరదలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని అన్నారు. మహారాష్ట్ర వర్షాలతో కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ల నుంచి వస్తున్న వరద నీటిని, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద పరిస్థితులను సమీక్షిస్తూ గేట్లు ఎత్తుతామని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలోనూ జాగ్రత్త చర్యలు చేపడుతున్నారని, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. మంచిర్యాల జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, ఆర్డీఓలు రాములు, హరికృష్ణ, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఎల్లంపల్లి ఈఈ స్వామి, డీఈఈలు శరత్‌బాబు, బుచ్చిబాబు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఎల్లంపల్లి' గేట్ల ఎత్తివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్ల ఎత్తివేత కొనసాగుతోంది. భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు ప్రాజెక్ట్‌లోకి చేరుతుండడంతో గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలకు గాను మంగళవారం 14.110 టీఎంసీల నీటిమట్టంతో ఉంది. ఎస్సారెస్పీ నుంచి ఇన్‌ఫ్లో 3 లక్షల క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి 2.20 లక్షల క్యూసెక్కులు వరదనీరు చేరుతోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 290 క్యూసెక్కులు, 62 గేట్లలో 32 గేట్లు ఎత్తి 4.75 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.


గోదావరిలో కలుస్తున్న వరద నీరు

రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు అందుకున్న రైతులు



అవార్డు అందుకుంటున్న శ్యాంసుందర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రావు

బెల్లంపల్లి: పాత మంచిర్యాలకు చెందిన గోనే శ్యాంసుందర్‌రావు, మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామ వాసి మండ్ల శ్యాంసుందర్ రెడ్డి రాష్ట్రస్థాయి అభ్యుదయ రైతు పురస్కారాలు అందుకున్నారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పదో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు హైదరాబాద్‌లో అట్టహాసంగా నిర్వహించారు. బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) అందిస్తున్న సూచనలు, సలహాలు పాటిస్తూ వ్యవసాయ రంగంలో రాణిస్తున్న శ్యాంసుందర్‌రావు, శ్యాంసుందర్‌రెడ్డిలకు కేంద్రీయ విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ బీజే.రావు, వ్యవసాయ వర్సిటీ ఉప కులపతి రఘునందన్‌రావు, రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి ఉత్తమ రైతు అవార్డులు అందజేశారు. రైతులను బెల్లంపల్లి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ, శాస్త్రవేత్తలు ప్రియ సుగంధి, తిరుపతి, స్రవంతి అభినందించారు.

రైతులను ఆదుకోవడానికి కార్యాచరణ


అన్నారం బ్యారేజీ వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేక్

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్
- నీటమునిగిన పంటల పరిశీలన

చెన్నూర్‌రూరల్: అన్నారం బ్యాక్‌వాటర్‌తో పంటలు నీటమునిగి నష్టపోతున్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని సుందరశాల గ్రామ సమీపంలో ఉన్న అన్నారం బ్యారేజీ, బ్యాక్‌వాటర్‌తో మునిగిన పంటలు పరిశీలించారు. సుందరసాల, వెంకంపేట గ్రామాల్లో నీట మునిగిన పంటలను పరిశీలించి అధికారులు, రైతులతో మాట్లాడారు. రైతులకు నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని భరోసానిచ్చారు. పంటలు నీట మునగకుండా కరకట్టల నిర్మాణానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే హామీనిచ్చారని గుర్తు చేశారు. కమీషన్లకు కక్కుర్తి పడే కేసీఆర్ మేడిగడ్డ వద్ద ప్రాజెక్టును నిర్మించి మంచిర్యాల, చెన్నూర్, మంథని, భూపాలపల్లి నియోజకవర్గాల్లో వేల ఎకరాల్లో పంటలు బ్యాక్ వాటర్ వల్ల మునిగిపోవడానికి కారణమయ్యారని విమర్శించారు. మాజీ జెడ్పీవైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, తహసీల్దార్ మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

భీమారం: మండల కేంద్రంలో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వివేక్ మంగళవారం మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారి పక్కన బాలుర వసతిగృహం వద్ద స్థలాన్ని పరిశీలించారు. 181 సర్వేనంబరులో ఎకరం స్థలాన్ని కేటాయించినా ప్రజలకు అందుబాటులో ఉండదని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వసతిగృహం వద్ద 20 గుంటల భూమి ఉందని నాయకులు వివరించారు. తహసీల్దార్ సదానందంతో ఎమ్మెల్యే మాట్లాడగా.. ప్రైవేట్ వ్యక్తుల భూమి అని వివరించారు. పట్టాదారులతో మాట్లాడాలని స్థానిక నాయకులను ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు చేకూర్తి సత్యనారాయణరెడ్డి, పోడేటిరవి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లకో క్రమబద్ధీకరణ..!

- సీఆర్పీల ఎదురుచూపులు
- కాంట్రాక్టు పద్ధతిలో పదిహేనేళ్లుగా విధులు


సీఆర్పీల ధర్నాకు అప్పట్లో మద్దతు ప్రకటించిన రేవంత్‌రెడ్డి(ఫైల్)

కోటపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి వివిధ రూపాల్లో ఉద్యోగులను నియమించుకుని విద్యాశాఖ కృషి చేస్తోంది. అందులో భాగంగా క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ), ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్, ఎంఐఎస్ కోఆర్డినేటర్స్, ఆపరేటర్లు, మెసేంజర్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్, టెక్నికల్ అనలిస్టులు, క్రాఫ్ట్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్స్, సీఆర్టీ, పీజీసీఆర్టీలు, స్కావెంజర్స్, కుక్స్ వంటి ఉద్యోగాల్లో కాంట్రాక్టు పద్ధతిన పలువురిని నియమించింది. వారితో పనులు చేయిస్తోంది. గత పదిహేనేళ్లుగా పని చేస్తున్న వారు క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని ప్రతీ మండలంలో పాఠశాలలకు మండల విద్యావనరుల కేంద్రానికి అనుసంధానంగా పని చేసేందుకు సీఆర్పీలు, సమాచార సరఫరా, వస్తువుల సరఫరా తదితర కార్యక్రమాలకు మెసేంజర్‌లు, జీతాల నిర్వహణ, ఆన్‌లైన్‌లో అధికారులతో సమన్వయానికి కంప్యూటర్ ఆపరేటర్లు పని చేస్తున్నారు. ఇలా కోటపల్లి మండలంలో సుమారు 25మంది ఉద్యోగులు ఉండగా.. జిల్లా వ్యాప్తంగా 548మంది పని చేస్తున్నారు.

ఉద్యోగ భద్రతే లక్ష్యం..

భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జిల్లా కేంద్రాల్లో పెద్దయెత్తున ఆందోళనలు నిర్వహించారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ నేతలు, సీఎం రేవంత్‌రెడ్డి సైతం అరగంటలో పరిష్కారమయ్యే సమస్యను ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమంటూ అప్పట్లో మద్దతు పలికారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వ ప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో మరోమారు ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు...

సమగ్రశిక్ష అభియాన్ పరిధిలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్, కనీస వేతన స్కీం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తారో తమకు అలాంటి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. ప్రతీ ఉద్యోగికి రూ.10లక్షల బీమా వర్తింపజేయాలని పేర్కొంటున్నారు. విద్యాశాఖ చేపట్టే నియామకాలల్లో వెయిటేజీని కల్పించాలని, తద్వారా న్యాయం జరుగుతుందని కోరుతున్నారు.

నిరసన తెలియజేస్తాం..



సంవత్సరాల తరబడి ఉద్యోగ భద్రత కల్పించాలని పోరాటం చేస్తున్నా తమను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నాలో పాల్గొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తమను గుర్తిస్తుందన్న నమ్మకంతో ఉన్నాం. ప్రభుత్వం తమను పట్టించుకోని పక్షంలో ఉద్యమం చేస్తాం.

–దేవులపల్లి సంపత్, సీఆర్పీ, కోటపల్లి

ఆవేదన అర్థం చేసుకోండి..



క్షేత్రస్థాయిలో విద్యార్థుల ఉన్నతికి పనిచేసే మాపై ప్రభుత్వం మానవతాదృక్పథంతో ఆలోచించాలి. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే ఉద్యోగాన్ని నమ్ముకుని బతుకుతున్నాం. మాకు ఉద్యోగ భద్రత కల్పిస్తే బాగుంటుంది. మా ఉద్యోగుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.

–భారతీ, జేఏసీ జిల్లా అధ్యక్షురాలు, మంచిర్యాల

డ్రగ్స్‌కు బానిసైతే జీవితం అంధకారమే

- రామగుండం సీపీ శ్రీనివాసులు
- గంజాయి బాధితులకు అవగాహన

మంచిర్యాలక్రైం: సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతి ప్రమాదకరమైన వ్యాధి గంజాయి(డ్రగ్స్) ఒక్కటీనని, ఇంతటి ప్రమాదకరమైన డ్రగ్స్ మహమ్మారికి బానిసైతే జీవితం అంధకారమేనని రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ పిల్లల, వృద్ధుల ఆనంద నిలయంలో మంగళవారం మంచిర్యాల పోలీసుల ఆధ్వర్యంలో 'మత్తు పదార్థాల నివారణకు అవగాహన సదస్సు' ఏర్పాటు చేశారు. డ్రగ్స్ బారిన పడిన యువకులకు పరివర్తన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గంజాయికి బానిసైన వారికి అనాథ ఆశ్రమాల్లో కూడా చోటు దక్కదని హెచ్చరించారు. సమాజంలో గుర్తింపు ఉండదని, ఎక్కడా పని దొరకదని, కన్నవారు దూరమవుతారని తెలిపారు. జిల్లాలో మూడు నెలల వ్యవధిలో 75కేసులు నమోదు చేశామని, 370మంది గంజాయి సేవించే, విక్రయించే వారిని గుర్తించామని అన్నారు. గంజాయి బాధితులు మారి గంజాయి నివారణకు సహకరిస్తే రివార్డు అందజేస్తామని సూచించారు. అనంతరం గంజాయి బాధితులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆనంద నిలయంలోని అనాథ పిల్లలు, వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. పండ్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక డీసీపీ ఏ.భాస్కర్, అదనపు డీసీపీ రాజు, ఏసీపీలు ఆర్.ప్రకాష్, రవికుమార్, వెంకటేశ్వర్లు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, సీఐలు బన్సిలాల్, ఆకుల అశోక్, డీ.సుధాకర్, అల్లం నరేందర్, మోహన్, దేవయ్య, కుమారస్వామి, ఎస్సైలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

మీ భద్రతే మా బాధ్యత

మంచిర్యాలక్రైం: మహిళల భద్రతే మా బాధ్యత అంటూ మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా షీ టీమ్ పోలీసులు మఫ్టీలో ఉంటూ డెకాయ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారని సీపీ శ్రీనివాసులు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో మహిళలు, బాలికలు, విద్యార్థుల భద్రతే లక్ష్యంగా షీ టీమ్ పని చేస్తోందని తెలిపారు. నేరుగా ఫిర్యాదుకు భయంగా ఉంటే షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700కు గాని, 100డయల్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి


కొండ రాజశేఖర్ (ఫైల్)

వేమనపల్లి: నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా, రైటర్‌గా పనిచేస్తున్న కొండ రాజశేఖర్ అనారోగ్యంతో మృతిచెందాడు. నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామమైన సీసీసీకి తరలించారు. ఎస్సై శ్యాంపటేల్, పోలీసులు తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి మహిళ మృతి


సరోజ మృతదేహం

బెల్లంపల్లిరూరల్(తాండూర్): బైక్ అదుపుతప్పి కిందపడిన మహిళ మృతి చెందినట్లు తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..తాండూర్ మండలం బోయపల్లికి చెందిన మాసాడి సత్యనారాయణ–సరోజ(45) దంపతులు. మంగళవారం సరోజ.. పని నిమిత్తం కుమారుడు అజయ్‌తో కలిసి బైక్‌పై బోయపల్లి శివారులోని రైతు వేదిక వద్దకు బయల్దేరింది. గ్రామ శివారులో చేరుకోగా బైక్ అదుపుతప్పి నుంచి కిందపడడంతో సరోజ తలకు గాయమైంది. స్థానికులు బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెకు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. అజయ్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. భర్త సత్యనారాయణ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఆయన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రహరీ కూల్చివేత


కూల్చివేయిస్తున్న అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కన్నాల శివారులో డబుల్ బెడ్రూం ఇళ్ల వెనకాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా నిర్మాణం చేస్తున్న ప్రహరీని మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. కన్నాల పంచాయతీలోని సర్వే నెంబర్ 112లో ఉన్న ప్రభుత్వ భూమిని గతంలో ఆక్రమించుకుని ప్రహరీ నిర్మాణం చేయగా అధికారులు జేసీబీతో కూల్చివేయించారు. తాజాగా మళ్లీ భూ ఆక్రమణదారు సిమెంట్ ఇటుకలతో ప్రహరీ నిర్మిస్తుండగా ట్రాక్టర్‌తో పడగొట్టించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆదిలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

'గిరి' పల్లెలో మృగాడు

- ఆదివాసీ మహిళపై ఆటో డ్రైవర్ లైంగికదాడికి యత్నం
- ప్రతిఘటించడంతో తీవ్రంగా కొట్టిన నిందితుడు
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం
- గాంధీ ఆస్పత్రిలో కోలుకుంటూ వాంగ్మూలం ఇచ్చిన బాధితురాలు
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన


జైనూర్‌లో రాస్తారోకో చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

సాక్షి, ఆసిఫాబాద్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం దేవుగూడ గ్రామానికి చెందిన ఓ ఆదివాసీ(గోండు) మహిళపై అత్యాచార యత్నం, హత్యాయత్నం చేసిన ఆటో డ్రైవర్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఘటనలో బాధితురాలు తీవ్రంగా గాయపడింది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లుగా కుటుంబ సభ్యులు భావించి ఈ నెల 1న సిర్పూర్(యూ) పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖంపై తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు ఆదివారం రాత్రి సిర్పూర్(యూ) పోలీసులకు వివరాలు తెలియజేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. జైనూర్ మండలం దేవుగూడకు చెందిన మహిళ(45) మక్కపిండి పట్టించడం కోసం గత శనివారం జైనూర్‌కు వచ్చింది. అదేరోజు పొలాల అమావాస్య కావడంతో సోయంగూడలో నివసిస్తున్న తన తల్లి ఇంటికెళ్లి రాఖీ కట్టేందుకు బయలుదేరాలని నిర్ణయించుకుంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అటుగా వెళ్తున్న సోనుపటేల్‌గూడకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ మగ్దూం ఆమెతో మాటలు కలిపాడు. తనూ అటే వెళ్తున్నా అంటూ ఆమెను ఆటో ఎక్కాలని సూచించాడు. మొదట తటపటాయించిన మహిళ అతని మాయ మాటలు నమ్మి ఆటో ఎక్కింది. ఆ సమయంలో ఆటోలో మరెవరూ లేరు. రాఘవాపూర్ గ్రామం దాటి అటవీ ప్రాంతానికి చేరుకోగానే ఆటోడ్రైవర్ ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడమే కాకుండా తీవ్రంగా ప్రతిఘటించడంతో ఆగ్రహంతో ఆటోడ్రైవర్ షేక్ మగ్దూం కర్రతో తీవ్రంగా ముఖంపై దాడి చేశాడు. దీంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది.

రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం..

కర్రతో తీవ్రంగా కొట్టడంతో ఆదివాసీ మహిళ స్పృహ తప్పిపడిపోగా.. ఆమె చనిపోయిందని భావించిన ఆటోడ్రైవర్ మగ్దూం ఆ ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశాడు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఘటనాస్థలి నుంచి తీసుకొచ్చి ఆమెను రోడ్డుపై పడేసి అక్కడి నుంచి జారుకున్నాడు. బాధితురాలు రోడ్డుపై పడి ఉన్న సమయంలో అటుగా ఓ వాహనం వెళ్లినట్లు గుర్తించిన స్థానికులు ఆమెను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిందని భావించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలిని వెంటనే జైనూర్ ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్‌కు అటు నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి కుటుంబసభ్యులు తరలించారు. మరుసటి రోజు ఆదివారం ఆమె సోదరుడు సిర్పూరు(యూ) పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సైతం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లుగా కేసు నమోదు చేశారు.

బాధితురాలి వాంగ్మూలంతో..

ముఖం, పెదాలపై తీవ్రగాయాలు అవడంతో బాధితురాలు రెండు రోజులపాటు మాట్లాడలేకపోయింది. సోమవారం కొంత కోలుకోగానే కుటుంబసభ్యులు సిర్పూరు(యూ) పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాంగ్మూలం రికార్డు చేసేందుకు వెళ్లిన పోలీసులకు బాధితురాలు పెదాలకు కుట్లు పడినా బాధను దిగమింగుకుని ఆటోడ్రైవర్ అఘాయిత్యాన్ని వివరించింది. దీంతో కేసు మలుపు తిరిగింది. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలంతో అత్యాచార యత్నం, హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద సిర్పూర్(యూ) పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం జైనూర్‌లో ఆటోడ్రైవర్ షేక్ మగ్దూంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య సమక్షంలో నిందితుడు నేరం అంగీకరించినట్లు తెలిసింది. వెంటనే నిందితుడిని సిర్పూరు(యూ) పోలీసులు ఆసిఫాబాద్‌కు తరలించారు.

నిందితుడిని ఉరి తీయాలి

జైనూర్(ఆసిఫాబాద్): ఆదివాసీ మహిళపై లైంగిక దాడికి యత్నించి, ఆపై హత్య చేయాలని ఉద్దేశంతో తీవ్రంగా గాయపర్చిన వ్యక్తిని వెంటనే ఉరి తీయాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనక యాదవ్‌రావు డిమాండ్ చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలనే డిమాండ్‌తో మంగళవారం జైనూర్ మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తాలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మగ్దూం అనే ఆటోడ్రైవర్ ఆదివాసీ మహిళను తీవ్రంగా గాయపర్చాడని తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్షించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న సీఐ రమేశ్, ఎస్సై సాగర్ ఘటనాస్థలికి చేరుకున్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి శిక్ష పడేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు చాహకటి గణేశ్, రవీందర్, శేకు పాల్గొన్నారు.

నేడు జైనూర్ బంద్‌కు పిలుపు

ఆదివాసీ మహిళపై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం జైనూర్ మండల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆదివాసీ నాయకులు తెలిపారు. వ్యాపారసంస్థలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని కోరారు.

తహసీల్దార్లకు పోస్టింగ్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో పలువురు డిప్యూటీ తహసీల్దార్లు తహసీల్దార్లుగా పదోన్నతి పొందగా ఆయా జిల్లాల్లో పోస్టింగ్ కేటాయిస్తూ సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పదోన్నతులు పొందిన వారికి మల్టీ జోన్ పరిధిలో ఖాళీల ప్రకారం జిల్లాలకు కేటాయించారు. ముగ్గురు మంచిర్యాల, నిర్మల్ జిల్లా నుంచి ఒకరిని ఆదిలాబాద్‌కు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఒకరిని ఆదిలాబాద్‌కు, మరొకరికి జగిత్యాల జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. ఇక పెద్దపల్లి జిల్లా నుంచి ముగ్గురిని, జగిత్యాల జిల్లా నుంచి ఒకరిని ఆసిఫాబాద్ జిల్లాకు పోస్టింగ్ ఇచ్చారు. ఒకరిని మంచిర్యాల జిల్లాకు ఇచ్చారు. వీరికి ఖాళీల ప్రకారం మండలాల్లో విధుల్లో చేరనున్నారు.

సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ పోటీలకు ఎంపిక


కోచ్ వికాస్‌హర్షతో సహస్ర

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రానికి చెందిన కందికట్ల సహస్ర కోల్‌కతాలో ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న యోనెక్స్, సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ అండర్–13 ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మెయిన్ డ్రా పోటీలకు ఎంపికైంది. ప్రస్తుతం జాతీయ స్థాయిలో 20వ ర్యాంక్‌లో ఉంది. తల్లిదండ్రులు స్రవంతి–మధుకుమార్, మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు ఆమెకు అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చదువుతున్న ఆమెకు బ్యాడ్మింటన్‌లో కోచ్ వికాస్‌హర్ష శిక్షణతో మెలకువలు నేర్చుకుంది.

మహిళా ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలి

- హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


కార్మికులతో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్: సింగరేణి వర్క్‌షాపుల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు పూర్తి సౌకర్యాలు కల్పించాలని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌ను సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల కోసం రెస్టుహాల్, వాష్‌రూంలు నిర్మించాలన్నారు. ఉద్యోగుల ఈపీఆర్ రికార్డుల్లో తప్పులను సరిచేయాలన్నారు. అవుట్ డోర్ డ్యూటీలకు వెళ్లిన కార్మికులకు ఔట్ మాస్టర్ నమోదు చేసేలా వెసులుబాటు కల్పించాలన్నారు. చాలా కాలంగా అమలవుతున్న ఔట్ మస్టర్ సమయం 3 గంటలకే కొనసాగించాలన్నారు. వర్క్ షాప్ క్యాంటీన్‌లో తినుబండారాలు తయారు చేయాలన్నారు. ఇంకా ఇతర సమస్యలపై డీజీఎం రవీందర్‌ను కలిసి చర్చించారు. ఈ సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. యూనియన్ ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, ఫిట్ సెక్రటరీ అశోక్, నాయకులు దుర్గం లక్ష్మణ్, చెవుల శ్రీనివాస్, ఆరెల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌స్టాఫ్ సబ్ కమిటీ ఎన్నిక


ఎన్నికైన కమిటీ సభ్యులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7 గని మైనింగ్‌స్టాఫ్ సబ్ కమిటీ(ఏఐటీయూసీ)ని బ్రాంచి ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. కుమారస్వామి(సెక్రెటరీ), పవన్ కుమార్(అసిస్టెంట్ సెక్రెటరీ), రంజిత్(జాయింట్ సెక్రెటరీ), ఆర్గనైజింగ్‌సెక్రెటరీలు రాజేశం–రిలే ఏ, విజయ్ కిరణ్–రిలే బీ, ప్రశాంత్–రిలే సీ, రామస్వామి–రిలే డీ ఎన్నికయ్యారు. నూతన కమిటీ మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారం కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఫిట్ సెక్రెటరీ బీర రవీందర్, నాయకులు ఉప్పరి చంద్రశేఖర్, బెల్లంపల్లి రీజియన్ మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ అసిస్టెంట్ సెక్రెటరీ విజయ్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, శ్రీరాంపూర్ ఏరియా మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, సెక్రెటరీ మారపెల్లి బాబు, రీజియన్ మైనింగ్‌స్టాఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్షాలతో ఓసీపీల్లో ఉత్పత్తికి ఆటంకం

- ఇన్‌చార్జి జీఎం టి.శ్రీనివాస్
- శ్రీరాంపూర్‌లో 73 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదు


మాట్లాడుతున్న ఇన్‌చార్జి జీఎం టి.శ్రీనివాస్

శ్రీరాంపూర్: వర్షాల కారణంగా ఈ సంవత్సరం ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలిగిందని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 31 నాటికి శ్రీరాంపూర్ ఏరియా 25.15 లక్షల టన్నులు సాధించాల్సి ఉండగా 18.35 లక్షల టన్నులే సాధించిందన్నారు. దీంతో 73 శాతం ఉత్పత్తి నమోదైందని తెలిపారు. భూగర్భ గనుల్లో ఉత్పత్తి తగ్గడానికి కారణం కొత్తగా వచ్చిన ఎస్‌డీఎల్ యంత్రాలను భూగర్భంలో దించడానికి సమయం పట్టడమేనని అన్నారు. దీంతో అనుకున్న ఉత్పత్తి లక్ష్యాలను సాధించలేదన్నారు. శ్రీరాంపూర్ ఏరియా ఆగస్టు నిర్దేశించిన లక్ష్యం 4.54 లక్షల టన్నులకు గాను 2.68 లక్షల టన్నులు సాధించి 59 శాతంతో సరిపెట్టుకుందన్నారు. వర్షం కారణంగా ఆగస్టులో కేవలం 53 శాతమే ఓబీ తీశామన్నారు. రాబోయే రోజుల్లో ఈ ఉత్పత్తి లోటును తగ్గించుకుని లక్ష్యసాధన కోసం కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఏరియా ఎస్‌ఓటుజీఎం ఎన్.సత్యనారాయణ, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, సీనియర్ పీఓ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

గణిత శాస్త్రవేత్తకు అంతర్జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ శంకర్‌రావు

రెబ్బెన: మండలంలోని కైరిగాం గ్రామానికి చెందిన గణిత శాస్త్రవేత్త డాక్టర్ శంకర్‌రావుకు ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ అవార్డు లభించింది. భువనేశ్వర్‌లో ఉమ్‌గ్రో రీసెర్చ్ ఫౌండేషన్, కెఎంబీబీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో గత నెల 30, 31న అంతర్జాతీయ మేధోసంపత్తి హక్కులు, ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్నెట్ ఆఫ్ థింకింగ్ రీచర్జీయేబుల్ మ్యాథమెటిక్ లెర్నింగ్ డిజిటల్ డివైజ్ అనే అంశంపై శంకర్‌రావు దేశ విదేశాల డెలిగేట్స్ సమక్షంలో నూతన ఆవిష్కరణ పేటెంట్‌ను ప్రజెంట్ చేశారు. నిర్వాహకులు ఉత్తమ పేటెంట్‌గా ఎంపిక చేసి ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్ అండ్ ఇన్నోవేషన్ అవార్డు–2024ను అందించారు. శంకర్‌రావు.. వోక్సెన్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో సీనియర్ గణిత ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. జాతీయ, అంతర్జాతీయ అవార్డులెన్నో పొందిన ఆయన్ను వోక్సెస్ యూనివర్సిటీ డీన్, అసిస్టెంట్ డీన్, ప్రోగ్రాం డైరెక్టరు, తదితరులు అభినందించారు.

సింగరేణి యాజమాన్యం, కాంట్రాక్టర్లు వైఖరి మార్చుకోవాలి

- మావోయిస్టు పార్టీ సింగరేణి కోల్ బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సింగరేణిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అన్యాయాలకు గురి చేస్తున్న కాంట్రాక్టర్లు, సింగరేణి యాజమాన్యం తమ వైఖరి మార్చుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. సింగరేణి వ్యాప్తంగా దాదాపు 29 వేల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు అండర్ గ్రౌండ్, ఓపెన్‌కాస్ట్‌లు, ఆస్పత్రులు, వివిధ డిపార్ట్‌మెంట్లలో పనులు చేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే కాంట్రాక్టులు రద్దు కావడం, పనులు పూర్తవ్వడం, గనులు, డిపార్ట్‌మెంట్ల మూసివేతతో జీవనోపాధి కోల్పోతూ కుటుంబాలతో సహా రోడ్డున పడుతున్నారని తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా సుశి కాంట్రాక్ట్ కంపెనీ, ఏరియా అధికారులు కలిసి రూ.5 కోట్ల పీఎఫ్ నిధులు కాజేశారని, ఈ నిధులు తిరిగి చెల్లించాలని హెచ్చరించారు.

వాలీబాల్ ఎంపిక పోటీలు వాయిదా

చెన్నూర్: చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగాల్సిన జిల్లాస్థాయి అండర్–17 వాలీబాల్ ఎంపిక పోటీలను వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు కార్యదర్శి ఫనిరాజా తెలిపారు. తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

పేకాటస్థావరాలపై దాడులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా ఎస్పీ డీవీ.శ్రీనివాస్‌రావు ఆదేశాలతో ఆసిఫాబాద్, వాంకిడి మండలాల్లోని గ్రామాల్లో మంగళవారం పేకాటస్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. పక్కా సమాచారంతో ఆసిఫాబాద్ దస్నాపూర్ శివారు ప్రాంతంలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ రాణాప్రతాప్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,100 నగదు స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌లో అప్పగించామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై సందీప్, పీసీలు సంజీవ్, దేవేందర్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న కార్మికులు

జైపూర్: ఇందారం ఓపెన్‌కాస్టు ఓబీ కాంట్రాక్టు పనులు చేపడుతున్న 'వరాహా'కంపెనీ మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని కాంట్రాక్టు కార్మికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కంపెనీలో పని చేస్తున్న కార్మికులు ఓపెన్‌కాస్టు గని కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమరవాది రోడ్డు వద్ద మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ దొంగ పట్టుబడినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా జాడి సురేష్ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. వెంటనే అదుపులో తీసుకుని అతని బ్యాగు తనిఖీ చేయగా 3 తులాల బంగారం, 5 తులాల వెండి ఆభరణాలు లభించాయి. స్టేషన్‌కు తరలించి విచారించగా అమరవాది గ్రామానికి చెందిన రాయలింగు ఇంట్లో ఆభరణాలు దొంగిలించినట్లు నిందితుడు తెలిపాడని వివరించారు. రాయలింగు ఇంట్లో ఓ శుభకార్యం జరుగుతుండగా సోమవారం తెల్లవారుజామున అందరూ నిద్రిస్తున్న సమయం చూసి చోరీకి పాల్పడ్డాడని తెలిపారు. అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టాలి


మాట్లాడుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు కూడా పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రతి ఒక్కరూ 8800002024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి సభ్యత్వం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎనగందుల కృష్ణమూర్తి, రజనీశ్‌జైన్, దుర్గం అశోక్, పట్టి వెంకటకృష్ణ, శ్రీదేవి, బొద్దున మల్లేశ్, కోడి రమేశ్, బద్రినాయక్, మాధవరపు వెంకటరమణ, బొలిశెట్టి అశ్విన్, మాసు రజిని, చిలుముల శ్రీకృష్ణ దేవరాయలు, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, గోపతి రాజయ్య పాల్గొన్నారు.

బుడగ జంగాల కాలనీలో పర్యటన


కాలనీలో పర్యటిస్తున్న చైర్మన్

జన్నారం: మండలంలోని పొనకల్ బుడగ జంగాల కాలనీలో గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి మంగళవారం పర్యటించారు. ఇటీవల అధిక వర్షం వల్ల వాగు ఉప్పొంగి కాలనీలోకి నీరు చేరిన విషయం తెలుసుకున్న ఆయన కాలనీలో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. కరెంటు, నీటి సమస్య, రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని, సమస్యలు తీర్చాలని కాలనీ వాసులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీ వాసులకు అన్నదానం చేశారు. ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్, స్థానిక నాయకులు అజ్మత్‌ఖాన్, సాయికుమార్, ఎజాస్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రకు నిలిచిన రాకపోకలు


వెంకట్రావ్‌పేట్–పోడ్సా వంతెన వద్ద ప్రవహిస్తున్న పెన్‌గంగ నది

సిర్పూర్(టి): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలం మీదుగా ప్రవహిస్తున్న పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సిర్పూర్(టి)–మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలో హుడ్కిలి వద్ద హుడ్కిలి లోలెవల్ వంతెన మునిగింది. రెండు రోజులుగా సిర్పూర్(టి) నుంచి మహారాష్ట్రకు రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా వెంకట్రావ్‌పేట్–పోడ్సా అంతర్రాష్ట్ర రహదారి గుండా వెళ్లే దారిలో వంతెన వరదనీటిలో మునిగింది. మహారాష్ట్రకు రెండు రోజులుగా రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

డెంగీ జ్వరంతో బాలిక మృతి


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు


దంద్రె గంగోత్రి (ఫైల్)

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావ్‌పేట్‌కు చెందిన బాలిక దంద్రె గంగోత్రి(16) డెంగీ జ్వరంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, నాయకులు బాలిక తల్లిదండ్రులు దంద్రె కుషాబ్‌రావ్–తిషాలను పరామర్శించారు. జ్వరంతో బాధపడుతున్నవారికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో రోజువారి శానిటేషన్ పనులు చేయించాలన్నారు. లోనవెల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నవత, నాయకులు ఎల్ములే శంకర్, నీరటి సత్యనారాయణ, అశోక్, వొడ్డేటి నాని, నులిగొండ రాజశేఖర్, నులిగొండ మహేశ్, రాచర్ల మహేశ్, దివాకర్, దుర్గం ప్రశాంత్, సాయి బనార్కర్, జావిద్ అహ్మద్ ఉన్నారు.